జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
సోమవారం
08-06-2026
సంపుటి 1 సంచిక 195
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సి.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)


# సింగపూర్ ఎన్నారై ప్రతినిధులతో కేటీఆర్ ప్రత్యేక సమావేశం

## తెలంగాణ అభివృద్ధిపై విస్తృత చర్చ

**దశ, ఎన్ఆర్ఐ ప్రతినిధి:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మలేషియాలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సింగపూర్ ఎన్నారై ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా సింగపూర్‌లో అమలవుతున్న పట్టణాభివృద్ధి, ప్రజా రవాణా వ్యవస్థ, పారిశుద్ధ్యం, టెక్నాలజీ వినియోగం, సమర్థవంతమైన పరిపాలన వంటి అంశాలపై కేటీఆర్ ఎన్నారై ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. తెలంగాణను ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాల అభివృద్ధి నమూనాలను అధ్యయనం చేసి అమలు చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే గతంలో

వివరాలు 2లో





## యాదాద్రి లక్ష్మీనరసింహుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**దశ, యాదాద్రి :** వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడంతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే హైదరాబాద్ సహా రాష్ట్రంలోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు యాదాద్రికి పోటెత్తారు. భక్త జనసందోహంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. లక్ష్మీనరసింహ స్వామి వారి ప్రత్యేక దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది. ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పడుతుంది. రద్దీ దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లుగా ఆలయ అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం ఉదయం యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఈవో భవానీ శంకర్, అర్చకులు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఉదయ పూజలు, అభిషేక సేవలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్శనానంతరం ఆలయ అధికారులు కిషన్ రెడ్డికి స్వామి వారి తీర్థ ప్రసాదాలతో పాటు జ్ఞాపికను అందజేశారు.




# మూసీ ప్రక్షాళనకు వేగం

## 122 కి.మీ. మెట్రో విస్తరణకు సీఎం గ్రీన్ సిగ్నల్

- మూసీ ప్రక్షాళనతో ఉపాధి అవకాశాలు
- పేదలకు అన్యాయం జరగదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ
- రూ.1,511 కోట్ల అభివృద్ధి పనులతో అభివృద్ధి వరాలు

**దశ, హైదరాబాద్ ప్రతినిధి :** హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా నాగోల్ నుంచి గౌరెల్లి వరకు చేపట్టనున్న మూసీ ప్రక్షాళన ఫేజ్ 2 పనులను వంద రోజుల్లో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో రూ.1,511 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఉప్పల్ భగాయత్ ఫేజ్ 3లో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.98 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.960 కోట్లతో ఏఓసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రోడ్లు, రూ.416 కోట్లతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్ వద్ద ఆరు లేన్ల ఫ్లైఓవర్, రూ.37.50 కోట్లతో 100 పడకల మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో

..మిగతా 4వ పేజీలో →

### తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో

# హాట్ టాపిక్‌గా ఎస్ఐఆర్ ప్రక్రియ

### యాక్టివవుతున్న బూత్ లెవల్ కమిటీలు




**దశ, హైదరాబాద్:** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతోనే అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్ర అప్రమత్తమయ్యాయి. తమ సానుభూతిపరుల ఓట్లు ఎక్కడైనా గంపగుత్తగా తొలగిపోతాయేమోననే ఆందోళనతో అన్ని రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ కమిటీలను, బీఎల్ఏలను రంగంలోకి దించాయి. సాధారణంగా ఎన్నికల సంఘం ప్రతి ఏడాది ఓటర్ల జాబితా సవరణ చేపడుతుంది. అయితే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మాత్రం పూర్తిగా భిన్నమైనది. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు నేరుగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఒకే ఇంట్లో అసాధారణ సంఖ్యలో నమోదైన ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల నమోదైన డబుల్ ఓట్లు వంటి

..మిగతా 4వ పేజీలో →



### గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో

## యువతి మృతి

### వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

**దశ, జోగులాంబ గద్వాల:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువతి మృతిచెందడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైద్యుల నిర్లక్ష్యం వల్లే యువతి ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఇందు (17) కడుపు నొప్పితో శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. వైద్య పరీక్షల అనంతరం శనివారం రాత్రి ఆపరేషన్ నిర్వహిస్తామని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. అనంతరం యువతిని సర్జరీ కోసం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లిన కొద్దిసేపటికే వైద్యులు బయటకు వచ్చి ఆమె మృతిచెందినట్లు చెప్పారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. చికిత్సలో నిర్లక్ష్యం కారణంగానే

..మిగతా 4వ పేజీలో →

### స్కూళ్లకు వేసవి సెలవులు

# పొడిగింపు

### 15న తిరిగి ప్రారంభం కానున్న పాఠశాలలు

**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులను తెలంగాణ ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 12తో సెలవులు ముగిసి, పాఠశాలలు

..మిగతా 4వ పేజీలో →






### కాటేదాన్ టు శంషాబాద్ రోడ్ వయా మైలార్‌దేవ్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్లాన్

### రూ.189.68 కోట్లతో ఏజెన్సీ ఎంపికకు ఆమోదం

# ఎయిర్ పోర్టుకు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లై ఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వైపు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ.. కాటేదాన్ టు శంషాబాద్ రోడ్ వయా మైలార్‌దేవ్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్లాన్ చేసింది. మొత్తం రూ.189.68 కోట్లతో ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ కొత్త ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించే అవకాశం ఉంది అంటున్నారు.హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.. అందుకు తగిన విధంగా మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించింది. ముఖ్యంగా నగరంలో రోజు, రోజుకు ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. భాగ్యనగరంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలను నిర్మిస్తున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో కొత్త ఫ్లైఓవర్ (బై డైరెక్షనల్ గ్రేడ్ సెపరేటర్) నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాటేదాన్ టు శంషాబాద్ రోడ్ వయా మైలార్‌దేవ్‌పల్లి మీదుగా ఆరు లేన్ల ఈ ఫ్లైఓవర్ప్లాన్ చేసింది. మొత్తం రూ. 189.68 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ పూర్తికాగా.. తాజాగా ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ప్రభుత్వం హెచ్‌సిటీ

..మిగతా 4వ పేజీలో →




# అమెరికాలో తెలుగు విద్యార్థి దారుణ హత్య

**దశ, హైద్రాబాద్ :** అమెరికాలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల కోసం వెళ్లిన ఓ తెలుగు విద్యార్థి దారుణ హత్యకు గురైన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. హైదరాబాద్‌కు చెందిన యువకుడు ఫిలడెల్ఫియాలో గుర్తుతెలియని దుండగుల చేతిలో కాల్పులకు గురై మృతి చెందాడు. తెలంగాణలోని మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి ప్రాంతానికి చెందిన కుంచా అన్షుల్ (28) అమెరికాలోని నార్త్ ఫిలడెల్ఫియాలో 'రేమండ్ రోసెన్ హోమ్స్' హౌసింగ్ కాంప్లెక్స్ పరిధిలో డోర్‌డాష్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన

..మిగతా 4వ పేజీలో →



### కాంగ్రెస్ పాలనపై

# హరీశ్ ఫైర్

### రైతులు, పేదల పట్ల ప్రభుత్వ వైఖరిపై మండిపాటు

**దశ, పెద్దపల్లి:** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతులు,

..మిగతా 4వ పేజీలో →

## కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంది

❖ మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** కరాటే ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే డు అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ జె.వి రమణ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎల్లో బెల్ట్ 25 మంది విద్యార్థులు, ఆరెంజ్ బెల్ట్ 7 విద్యార్థులు, గ్రీన్ బెల్ట్ ముగ్గురు విద్యార్థులు, బ్లూ బెల్ట్స్ ముగ్గురు విద్యార్థులు, బ్రౌన్ బెల్ట్స్ ఒకరుతో పాటు శిక్షణ పొందిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో బాలికలు తమ ఆత్మ రక్షణ కోసం కచ్చితంగా కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటే తో శారీరక దారుఢ్యం, మేదో సంపత్తి ఎంతగానో పెరుగుతుందన్నారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. నేటి యువత గంజాయి కి మత్తు పదార్థాలకు బానిస కాకుండా కరాటే వంటి స్పోర్ట్స్ పై ఆసక్తి పెంచు కోవాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆసక్తిని గమనించి ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా మాట్లాడుతూ కరాటే అంటే ఎలాంటి ఆయుధాలు లేకుండా చేతులతో తనను తాను రక్షించుకునే గొప్ప విద్య అని తెలిపారు. కరాటే నేర్చుకోవడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ నామ అరుణ ప్రవీణ్, కరాటే శిక్షకులు జె వి రమణ, శ్రీమన్నారాయణ, రిషికేష్, హర్షవర్ధన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో పలు షాపుల్లో చోరీ

❖ నగదు, వస్తువులతో పరారైన దుండగులు

**దశ, పెద్దంబర్పేట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో వరుస చోరీలు కలకలం రేపాయి. స్థానికంగా ఉన్న మూడు దుకాణాల్లో గుర్తుతెలియని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి సమయంలో జరిగినట్లు సమాచారం. దుండగులు ముందుగా ప్లాస్టిక్



ప్లేట్లు, గ్లాసుల దుకాణాన్ని లక్ష్యంగా చేసుకుని షట్టర్ పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం సమీపంలోని మరో రెండు షాపుల్లో కూడా చోరీలకు పాల్పడ్డారు. దుకాణాల్లో ఉన్న సుమారు రూ.2 వేల నగదుతో పాటు పలు వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఆదివారం ఉదయం షాపులు తెరవడానికి వచ్చిన యజమానులు షట్టర్లు ధ్వంసమైన పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దుండగులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వరుస చోరీలతో స్థానిక వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది.

## తారామతిపేటలో విషాదం.. కారు ఢీకొని బాలుడు మృతి

**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకల శ్రీకాంత్ (5) రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మృతి చెందాడు. మహంకాళి ఆలయం వెనుక భాగంలో సాయంత్రం సుమారు 5:20 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ నుంచి గ్రామం వైపు వస్తున్న టాటా ఇండికా కారు (TS 09 EB 2073) బాలుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

## పెద్ద అంబర్‌పేటలో అభివృద్ధి పనుల జోరు..

❖ సీసీ రోడ్డు పనులను పరిశీలించిన సిద్దంకి కృష్ణారెడ్డి



**దశ, పెద్ద అంబర్ పేట :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తాజా మాజీ కౌన్సిలర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సిద్దంకి కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట శిల్పి కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలనీల్లో దీర్ఘకాలంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిల్పి కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు పాల్గొని అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం జరగడం వల్ల రాకపోకల ఇబ్బందులు తొలగి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు.

# తెలంగాణలో క్లినికల్ సైకాలజీ వృత్తి బలోపేతానికి కార్యాచరణ

❖ హైదరాబాద్‌లో టీపీసీపీ సర్వ సభ్య సమావేశం...



**దశ ఓయూ:** తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ సర్వసభ్య సమావేశం ఆదివారం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో నిర్వహించా రు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కార్యవర్గ సభ్యులు, కార్యనిర్వా హక కమిటీ సభ్యులు, క్లినికల్ సైకాలజిస్టులు ఈ సమావేశానికి హాజరయ్యారు.తెలంగాణలో క్లినికల్ సైకాలజీ వృత్తిని మరింత బలోపేతం చేయడం, మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వృత్తిపరమైన సహకారాన్ని విస్తరించడం,సభ్యుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్స హించడం వంటి అంశాలపై సమా వేశంలో ప్రధానంగా చర్చించారు.

ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన కార్యనిర్వాహక కమిటీని సభ్యుల కు లాంఛనంగా పరిచయం చేశా రు. సంఘం నిర్మాణం,బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళి కలు, సభ్యుల పాత్రలపై సమగ్ర అవగాహన కల్పించారు.

అడ్వొకసీ అండ్ పబ్లిక్ అవేర్‌నెస్, ఎథిక్స్ అండ్ లీగల్ అడ్వైజరీ, ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషనల్, సోషల్ మీడియా, గవర్నమెంట్ లైజన్ టాస్క్ ఫోర్స్ కమిటీల లక్ష్యాలు, విధులు, భవిష్యత్ కార్యక్రమాలపై సవివరంగా చర్చలు జరిగాయి. రాష్ట్రంలోని క్లినికల్ సైకాలజిస్టుల వృత్తి పర మైన అభివృద్ధి, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపు, విధానపరమైన అంశాలపై ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరిపే వ్యూహాలపై సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మానసిక ఆరోగ్య సేవల అభివృ ద్ధికి, క్లినికల్ సైకాలజిస్టుల వృత్తి పరమైన ప్రయోజనాల పరిరక్షణకు టీపీసీపీ కట్టుబడి ఉందని నాయ కులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల మానసిక శ్రేయస్సు కోసం మరిన్ని అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు చేపట్టను న్నట్లు వెల్లడించారు.ఈ సమావే శంలో టీపీసీపీ సలహా కమిటీ సభ్యురాలు డా. సరోజ్ ఆర్య, అధ్యక్షురాలు డా. వృషాలి రెడ్డి, ఉపాధ్యక్షుడు డా. సోమశేఖర్, కార్యదర్శి శిల్పా పన్నాల, సంయుక్త కార్యదర్శి గీతా మాగేష్, కోశాధికారి అంజన్‌కుమార్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొ న్నారు.



## టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా బండారు శ్రీనివాస్ ఎన్నిక

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని టిపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ జిల్లా అధ్యక్షులు రాపర్తి రామనరసయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీ బండారు శ్రీనివాసును జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ నిర్మాణం కోసం తన వంతు పాత్రను పోషిస్తానని టిపిటిఎఫ్ సంఘము యొక్క భవన నిర్మాణానికి నా వంతు సహకారం అందించడమే కాకుండా అందరి సహకారంతో సంఘ భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలియజేశారు.

అదేవిధంగా మీ అందరి సహకారంతో సంఘాన్ని మరింత ముందుకు తీసుకపోవడానికి మరియు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త కాసర్ల వీరారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన కక్కిరేణి శ్రీనివాస్, కాసర్ల వీరారెడ్డి కలిసి బండారి శ్రీనివాస్ ని ఘనంగా సన్మానించారు, ఇట్టి కార్యక్రమంలో రమేష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రమణ, వీరయ్య, కృష్ణంరాజు, ప్రభాకర్, రమేష్, అశోక్, రేవన్ తదితరులు పాల్గొన్నారు.

## బండరావిరాల డంపింగ్ యార్డ్ ప్రాజెక్టను వెంటనే రద్దు చేయాలి: సర్పంచ్ విజయ్ కుమార్



**దశ, అబ్దుల్లా పూర్ మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలోని సర్వే నెం. 268లో ప్రతిపాదించిన 494 ఎకరాల భారీ డంపింగ్ యార్డ్ (ఎకో టౌన్) ప్రాజెక్టను తక్షణమే రద్దు చేసి, జీవో నెం.20ను ఉపసంహరించుకోవాలని గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కోహెడలో జరిగిన అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన సభలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బండరావిరాల గ్రామ పేరు ప్రస్తావించకుండా, డంపింగ్ యార్డ్‌పై వస్తున్న అభ్యంతరాలను ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంగా చిత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. ప్రభుత్వ అధికారిక ఉత్తర్వుల్లోనే బండరావిరాల సర్వే నెంబర్ 268లో 494 ఎకరాల విస్తీర్ణంలో ప్రాజెక్టు ప్రతిపాదించబడిందని స్పష్టంగా ఉందన్నారు. నిజంగా ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే, ముఖ్యమంత్రి సమక్షంలోనే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేయాల్సిందని పేర్కొన్నారు. ఒకవైపు ప్రాజెక్టు విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతూనే, మరోవైపు అధికారులు ప్రతిపాదిత స్థలాలను సందర్శించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికే గ్రామ పరిసరాల్లో ఉన్న క్రషర్ల వల్ల తీవ్రమైన ధూళి, శబ్ద కాలుష్యంతో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో మరో భారీ డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయడం గ్రామ ప్రజల జీవితాలతో చెలగాటమాడటమేనన్నారు.

హైదరాబాద్ నగరంలోని మురికి చెత్తను గ్రామాలపై మోపే ప్రయత్నాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోరని హెచ్చరించారు. గ్రామాల భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే జీవో నెం.20ను రద్దు చేసి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, యువ నాయకులు గుండ్ల సతీష్ యాదవ్, ఏర్పుల నరేష్, ఒంగూరి రమేష్, కొత్త శ్రీకాంత్ గౌడ్, నేమురగోముల కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షులు Dr. రావుల కృష్ణ



**దశ ఓయూ:** ఏబీవీపీ సభ్యత్వ నమోదు వర్క్ షాప్ కి తెలంగాణ నలుమూలల నుండి 300 మంది ముఖ్యమైన కార్యకర్తలతో నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రావుల కృష్ణ విచ్చేసి విద్యార్థినిలకు ఏబీవీపీ సభ్యత్వాన్ని అందించారు.. రావుల కృష్ణ మాట్లాడుతూ ఏబీవీపీ అంటేనాలుగుఅక్షరాలుకాదుతెలంగాణరాష్ట్రంలోఉన్ననాలుగు కోట్ల ప్రజల గుండెచప్పుడు అనునిత్యం విద్యార్థి సమస్యల పైన, విద్యార్థి కష్టసుఖాలలో, చిట్టచివరి విద్యార్థికి కూడా నాణ్యమైన విద్య, విద్య ప్రమాణాలతోటి విద్యను అందిస్తూ... "నేటి విద్యార్థి నేటి పౌరుడే" అనే నినాదంతో వ్యక్తి నిర్మాణం ద్వార జాతీయ పునర్నిర్మాణం అనే మహాయజ్ఞ కార్యాన్ని నిర్మిస్తున్నది అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP).ABVP స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో గాని, ప్రపంచంలో నెంబర్ వన్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ అని మనందరికీ తెలుసు... ఈ సంవత్సరం 2026 2027 ABVP పెద్ద లక్ష్యాన్ని 10,00,000 మెంబర్షిప్పె పెట్టుకొని ముందుకు వెళుతున్నది... ఈ సంవత్సరం పట్టణాల నుండి మండల వరకు వెళ్లి చిట్ట చివరి విద్యార్థి వరకు మెంబర్షిప్ చేయడం లక్ష్యంగా ముందుకు వెళుతున్నది. ఏబీవీపీ మెంబర్షిప్ కు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న విద్యార్థిని, విద్యార్థులు మరియు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ మెంబర్షిప్ ను విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన మంత్రి విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, గ్రేటర్ హైదరాబాద్ సంఘటన మంత్రి రాజశేఖర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మలబిక గారు, కార్యదర్శి పృధ్వి, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, హర్ష, సంయుక్త కార్యదర్శులు మహేష్, రాజు, దీపికా, మరియు స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్స్, విభాగ్ కన్వీనర్లు, జిల్లా కన్వీనర్లు, టౌన్ సెక్రటరీస్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ మరియు ముఖ్యమైన కార్యకర్తలు పాల్గొన్నారు..

## కాంగ్రెస్ పాలనలో చెరువులను తలపిస్తున్న రహదారులు..!

❖ నేతాజీ కాలనీ – విలేజ్ లింక్ రోడ్ దుస్థితిపై ఆగ్రహం

**దశ, హయత్‌నగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి విమర్శించారు. హయత్‌నగర్ పరిధిలోని నేతాజీ కాలనీ మెయిన్ రోడ్ నుండి విలేజ్ రోడ్‌కు వెళ్లే లింక్ రోడ్ పూర్తిగా దెబ్బతిని చెరువులను తలపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా గుంతలమయంగా మారిన



రహదారుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో రోడ్లు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. గుంతలు ఎక్కడున్నాయో కనిపించక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన కూడళ్లు, కాలనీల రోడ్లు కనీసం నడిచే పరిస్థితిలో కూడా లేవని, స్థానిక ప్రజలు, కాలనీ అసోసియేషన్లు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి యుద్ధ ప్రాతిపదికన గుంతలను పూడ్చి, దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్త రహదారులను నిర్మించాలని సామ తిరుమల రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నిర్లక్ష్య ధోరణిని వెంటనే ఆపాలని హెచ్చరించారు.




# ప్రైవేట్ చిట్టి, వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

❖ *రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్*



**దశ, మణుగూరు:** పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలో చిట్టీ వ్యాపారుల, అక్రమ వడ్డీ వ్యాపారుల దందా పెచ్చు మీరుతోంది. రెక్కాడితే డొక్కాడని వ్యాపారులను, నిరుపేదలను, సామాన్యులకు మోయలేని అధిక భారమైన వడ్డీకి డబ్బులు ఇచ్చి ప్రాణాలు తీస్తున్నారు. కొందరు వ్యాపారులు చెక్కులు తీసుకుని అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి పీడించుకు తినడం వల్ల వ్యాపారులు కుదేలు అవుతున్నారు. ఎందరో ఊర్లను వదిలి వెళ్ళిపోయారు. చెక్కులు తీసుకొని అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి ల్యాబ్లను ఆసుపత్రులను బ్లాక్ మెయిల్ చేస్తూ తమ దందా కొనసాగిస్తున్నారు ఎంతటి వాడు అయినా ఉపేక్షించేది లేదు.

ఏజన్సీ ఏరియాలో ఇది చట్ట విరుద్ధం అయినది. బాధితులు తీవ్ర ఆవేదనకు గురి అవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అయినా విచ్చలవిడిగా చీటీలు, వడ్డీ వ్యాపారాలు దందా నడుపుతూ పచ్చని మండలంలో వికృత చేష్టలకు పాల్పడి కనిపించని దందా చేస్తున్నారు. దీనిపైన రేణుక అక్షరం మహిళా మండలి మండిపడుతోంది. ఇలా వ్యాపారం చేసే అక్రమార్కులపై స్థానిక డిఎస్పీ, సీఐ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సమీప గ్రామాల బాధితులకు అండగా నిలవాలని రేణుక అక్షర మహిళా మండలి నిర్ణయం తీసుకుంది. అధిక వడ్డీ వ్యాపారాలు చేసినా, అక్రమంగా చీటీ, ఫైనాన్స్ వ్యాపారాలు చేసినా సహించేది లేదన్నారు. బాధితులతో దందాలకు పాల్పడే వారిని ప్రజాక్షేత్రంలో నిలబెట్టి కఠిన శిక్షలు విధించే విధంగా కృషి చేస్తాం. వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ వ్యాపారులు, అక్రమంగా నిర్వహించే ప్రైవేటు చీటీలు గాని ఎవరన్నా ఇబ్బందులు గురి చేస్తే తమను సంప్రదించాలని ఈ సందర్భంగా పిలుపు స్తున్నామన్నారు. బాధితులను స్థానిక పోలీసులు అనంతరం జిల్లా ఎస్పీ దగ్గరికి తీసుకెళ్లి అయిన న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమం లో మహిళా సీనియర్ నాయకురాలు ఎండీ షబానా, కోరి శ్యామల, మరియు బొడ్డు సౌజన్య, దేరంగుల సుజాత, రెడ్డీబోయిన రేణుక,బడిశా పార్వతి, హేమలత, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.

# అటవీ జంతువుల వేట, చెట్ల నరికివేతపై కఠిన చర్యలు

❖ *ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత*



**దశ, పినపాక:** అటవీ జంతువుల వేట, చెట్ల నరికివేతపైకఠిన చర్యలు తప్పవని ఏడూళ్లబయ్యారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత హెచ్చరించారు. పినపాక మండలం ఏడూళ్లబయ్యారంలో ఆదివారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత మాట్లాడుతూ అటవీ జంతువులను వేటాడినా, చెట్లను అక్రమంగా నరికినా కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ కోసం అడవి ప్రాంతాల్లో సోలార్ ఆధారిత సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కెమెరాల ద్వారా అటవీ ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు అటవీ సంరక్షణకు సహకరించాలని ఆమె కోరారు.

# ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరానికి విశేష స్పందన

*ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం : డాక్టర్ లహరి*



**దశ, అశ్వారావుపేట:** డాక్టర్ సురేష్ రామాల ఆధ్వర్యంలోని న్యూ స్టార్ చిల్డ్రన్స్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత మెడికల్ స్క్రీనింగ్ టెస్ట్ శిబిరం అశ్వారావుపేటలో విజయవంతంగా జరిగింది. భద్రాచలం రోడ్డులోని వినాయకుడి గుడి సమీపంలో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ భీమిరెడ్డి లహరి (ఎం.డి జనరల్ మెడిసిన్) ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని తగిన వైద్య సలహాలు, మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో పాటు మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డాక్టర్ సురేష్ రామాల ఆధ్వర్యంలో చిన్నపిల్లలు, పెద్దల కోసం న్యూ స్టార్ చిల్డ్రన్స్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరింత విస్తృత సేవలతో అందుబాటులోకి వస్తోందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**దశ, మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రూ.39 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదివారం భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మణుగూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు, పట్టణంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఏఈ సత్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, శానిటరీ జవాన్ నరేందర్ పాల్గొన్నారు.

అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, దొబ్బల వెంకటప్పయ్య, మైనారిటీ అధ్యక్షులు రహీం భాషా, 14వ వార్డు అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సామ శ్రీనివాస్ రెడ్డి, తాత ప్రసాద్, గణేష్ రెడ్డి, పాతూరు వెంకన్న, తోపుడి శ్రీను, డీవీ, జరుపుల జగన్, పురం రవి, చింతల కృష్ణ, కొర్లకుంట అప్పారావు, అబ్దుల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహం తొలగింపు పద్ధతి కాదు

**దశ, పినపాక:** అశ్వాపురం మండలంలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం పద్ధతి కాదని మాల మహానాడు పినపాక మండ అధ్యక్షులు నూలు కృష్ణ, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిగొండ రామకృష్ణ జిల్లా సహాయ కార్యదర్శి దాసరి రవికుమార్ ఖండించారు. అశ్వాపురం మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులు రాత్రికి రాత్రే తొలగించడంపై మాల మహానాడు పినపాక మండల కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మాలమహనాడు పినపాక మండల అధ్యక్షులు నూలు కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం దళితుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వేంకటేశ్వర్లు దృష్టి పెట్టి వెంటనే విగ్రహాన్ని యథాస్థానంలో పునఃప్రతిష్ఠించాలని కోరారు. మహనీయుడుకి ఇంత అవమానం జరుతుంటే ఏమాత్రం పట్టించు కొకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మమ్మల్ని పట్టించు కోకపోతే ఎలా అని ప్రశ్నించారు. అంబేద్కర్ అంటే అందరివాడు అని మాలమహానాడు భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిగొండ రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి దాసరి రవికుమార్ తెలిపారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

❖ *భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్*



**దశ, కొత్తగూడెం:** జూన్ 8వ తేదీ కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమ వుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# మహాసభలను విజయవంతం చేయండి

**దశ, మణుగూరు:** మణుగూరులో ఈ నెల 11న జరిగే జిల్లా వ్యవసాయ కార్మిక మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి రేపాక శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మహా సభకు ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి బి.వెంకట్ రానున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, పిట్టల నాగమణి, నైనరపు నాగేశ్వరరావు, కొండ్రుగౌరీలు పాల్గొన్నారు.








# పనులు త్వరగా పూర్తి చేయాలి

*డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క*

**దశ, మధిర:** మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' పనులను వెంటనే త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జూనియర్, సీనియర్ హాస్టళ్లు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ల్యాబ్ భవనాల పురోగతిని సమీక్షించి, అధికారులకు, గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు కేవలం భవనాలు కావు, రేపటి తరాలను తీర్చిదిద్దే దార్శనిక దేవాలయాలు, విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి వ్యయం కాదు, భవిష్యత్ తరాల అభివృద్ధికి పెట్టే పెట్టుబడి అని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో మా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.





# మూసీ ప్రక్షాళనకు వేగం

**మొదటి పేజీ తరువాయి**

భాగంగా కామన్ యూనిఫైడ్ బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టమ్ (క్యూర్ 1) యాప్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి, నగర అభివృద్ధికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సిన అవసరాన్ని వివరించారు. హైదరాబాద్‌ను కేవలం అంతర్జాతీయ నగరంగా చెప్పుకోవడం సరిపోదని, ఆ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే గుర్తింపు వస్తుందని సీఎం పేర్కొన్నారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 122 కిలోమీటర్ల మేర మెట్రో రైలు విస్తరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓవైసీ ఆస్పత్రి మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు, అలాగే ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. మూసీ నది ప్రక్షాళనపై మాట్లాడిన సీఎం, గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా నది అభివృద్ధి పనులను ఉదాహరణగా ప్రస్తావించారు. 55 కిలోమీటర్ల మేర మూసీ నదిని ప్రక్షాళన చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు నగర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మూసీ కాలుష్యం కారణంగా హైదరాబాద్‌తో పాటు నల్గొండ జిల్లాలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫ్లోరైడ్ సమస్యతో పాటు కాలుష్యం కూడా ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగదని, పేదలను నిరాశ్రయులను చేయబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అవసరమైతే ప్రత్యామ్నాయ గృహాలు, మెరుగైన విద్యా సదుపాయాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ విజన్2047 లక్ష్యాలకు అనుగుణంగా ఓఆర్ఆర్ లోపలి 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజినల్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంగా గుర్తించినట్లు సీఎం వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లుగా వికేంద్రీకరణ చేపట్టామని, ఇదే విధానాన్ని పోలీసు వ్యవస్థలో కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి ప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులు, అనుమతులు అందించేందుకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంత నిధులు అవసరమైనా కేటాయిస్తామని హామీ ఇస్తూ, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరిస్తే హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దగలమని అన్నారు.

## ఎయిర్ పోర్టుకు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ

**మొదటి పేజీ తరువాయి**

(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటీవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)లో భాగంగా ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలు సాగించేలా ఈ నిర్ణయం తీసుకుంది. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌వైపు రాకపోకలు సాగించేవారితో పాటుగా, స్థానికంగా ఉండే ట్రాఫిక్‌తో పాటుగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ కారణంగానే తరచూ ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు.. ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కోసం ఈ వంతెన ప్లాన్ చేశారు.ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి మొత్తం రూ.189.68 కోట్లతో మూడు జంక్షన్‌ల దగ్గర సిగ్నల్ ఫ్రీ జర్నీ కోసం బ్రిడ్జిని ప్రతిపాదించారు. ఈ వంతెనకు సంబంధించిన టెండర్ విషయానికి వస్తే.. కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్‌ను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మరో రెండు కాంట్రాక్ట్ సంస్థలు కూడా బిడ్‌లు దాఖలు చేయగా.. అంచనా కంటే ఎక్కువ కోట్ చేశాయి. కేఎన్ఆర్ కాంట్రాక్ట్ సంస్థ మాత్రం 189.68 కోట్లు (4.71 శాతం) కోట్ చేసింది. అధికారులు టెక్నాలజీతో పాటుగా ప్రైస్ బిడ్‌ను పరిశీలించారు.. ఆ వివరాలను జీహెచ్‌ఎంసీ మున్సిపల్ శాఖకు పంపించింది. అనంతరం ఎల్1 బిడ్డర్‌గా ఉన్న కేఎన్ఆర్ సంస్థను ఎంపిక చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.హైదరాబాద్ సిటీలోని అన్ని ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు.. వారికి ఊరట దక్కనుంది. అలాగే ఫలక్‌నుమా, బహదూర్‌పురా, బండ్లగూడ, చాంద్రాయణగుట్టతో సహా పలు ప్రాంతాలవారికి విమానాశ్రయానికి రాకపోకలు సులువు కానున్నాయి. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవని చెబుతున్నారు. ఇప్పటికే కేబీఆర్ పార్కు జంక్షన్, ఫాక్స్ సాగర్ బ్రిడ్జి, గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ ఏరియాల్లో బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభించారు. వీటితో పాటుగా పంజాగుట్టలోని ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్, అల్వీన్ కాలనీ, రసూల్‌పుర జంక్షన్ల దగ్గర కూడా ఫ్లై ఓవర్ల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది.

## తెలంగాణలో 2 కొత్త నేషనల్ హైవేలు

### ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563) . సెక్షన్ల అభివృద్ధి

**దశ, అదిలాబాద్:** తెలంగాణలో కొత్తగా మరో రెండు జాతీయ రహదారులకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సీసీఈఏ (ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ) సమావేశంలో ఆమోదించారు. ఈ రెండు నేషనల్ హైవేలలో ఆర్మూర్‌జగిత్యాలమంచిర్యాల (ఎన్‌హెచ్ 63), జగిత్యాలకరీంనగర్ (ఎన్‌హెచ్563) సెక్షన్ల అభివృద్ధి చేయనున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ గత ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు హైవేలకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు ప్రక్రియను పూర్తి చేసింది. సీసీఈఏ ఆమోదంతో ఈ ఏడాది పనులు ప్రారంభంకానున్నాయి. తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేల కోసం రూ.7,597.16 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. మూడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం 190 కిలోమీటర్లు పొడవున నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నారు. జగిత్యాలకరీంనగర్ హైవేను బీవోటీ పద్ధతిలో నిర్మిస్తారు. ఆర్మూర్‌జగిత్యాలమంచిర్యాల (ఎన్‌హెచ్ 63) పనులను హ్యామ్ పద్ధతిలో పూర్తి చేస్తారు. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే ఆర్మూర్ మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం దాదాపుగా గంటన్నర వరకు తగ్గుతుందని చెబుతున్నారు. అలాగే జగిత్యాలకరీంనగర్ మధ్య హైవేతో 45 నిమిషాలు తగ్గనుందంటున్నారు. ఈ రెండు జాతీయ రహదారుల్ని పీఎం గతిశక్తి పథకానికి అనుగుణంగా రూపొందిస్తున్నారు. ఈ రెండు నేషనల్ హైవేలను పలు ప్రాజెక్టులకు అనుసంధానం చేయనున్నారు. వీటిలో ఆర్థిక కేంద్రాలు, సామాజిక కేంద్రాలు, లాజిస్టిక్ కేంద్రాలు కూడా ఉన్నాయిఆర్మూర్‌జగిత్యాల మంచిర్యాల నేషనల్ హైవే 63 నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మీదుగా వెళుతుంది. జగిత్యాలకరీంనగర్ నేషనల్ హైవే విషయానికి వస్తే.. పోతారం, గంగాధర, కరీంనగర్ వరకు వెళుతుంది. ఈ హైవేలలో బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. గంటలకు 100 కిలోమీటర్లు స్పీడ్ వెళ్లేలా రోడ్లను డిజైన్ చేశారు. ఈ రెండు హైవేలు ఫిషింగ్ సీఫుడ్ క్లస్టర్, పలు రైల్వే స్టేషన్‌లను కనెక్ట్ చేయనున్నాయి. మొత్తం మీద త్వరలోనే కొత్త జాతీయ రహదారులు నిర్మాణం కాబోతున్నాయి. వాస్తవానికి సీసీఈఏ సమావేశంలో ఈ రెండు జాతీయ రహదారులతో పాటుగా ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు సంబంధించి ఆమోదం లభిస్తుంది అనుకున్నారు.. ఆ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.. ఆమోదం లభించలేదు.

## హాట్ టాపిక్‌గా ఎస్ఐఆర్ ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి**




అంశాలను గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. అదే సమయంలో అర్హులైన కొత్త ఓటర్లను చేర్చే ప్రక్రియ కూడా కొనసాగుతుంది. రాజకీయ పార్టీలకు ఈ ప్రక్రియ పెద్ద పరీక్షగా మారింది. ఎందుకంటే అనేక నియోజకవర్గాల్లో గెలుపోటములను కొన్ని వందల లేదా వేల ఓట్లే నిర్ణయిస్తున్నాయి. ఈ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో స్థానిక అధికారులు పొరపాటునో, లేక ఏకపక్షంగానో తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను “వలస వెళ్లారు”, “చిరునామా లేదు” అనే కారణాలతో తొలగిస్తే అది పూడ్చలేని నష్టమవుతుందని పార్టీలు భావిస్తున్నాయి. అందుకే ఓటర్ల జాబితాలో తమ క్యాడర్ ఓట్లు తగ్గిపోకుండా కాపాడుకోవడానికి ప్రత్యేక వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి పార్టీ తమ బూత్ లెవెల్ ఏజెంట్లను మరింత అప్రమత్తం చేస్తోంది. ప్రభుత్వ బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగే సమయంలో పార్టీ బీఎల్ఏలు కూడా వారితో పాటు తిరుగుతూ తమ అనుచరుల ఓట్లు జాబితా నుంచి తొలగిపోకుండా కాపలా కాస్తున్నారు. మరోవైపు ప్రత్యర్థి పార్టీలకు అనుకూలంగా ఉన్న చనిపోయిన వారి ఓట్లు, డబుల్ ఓట్లు వంటి అంశాలపై ఫామ్7 ద్వారా ఫిర్యాదులు చేస్తూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. డిజిటల్ డేటా ఆధారంగా పార్టీల ఐటీ విభాగాలు కూడా ఈ ప్రక్రియను నిశితంగా గమనిస్తున్నాయి. సాంకేతికంగా ఓటు తొలగిపోయినా ఫామ్6 ద్వారా మళ్లీ చేర్పించుకునే అవకాశం ఉన్నప్పటికీ, అది ప్రాక్టికల్‌గా అంత సులభం కాదు. ఒకసారి ఇంటెన్సివ్ రివిజన్ పూర్తై ఫైనల్ ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత మళ్లీ ఓటు చేర్పించుకోవాలంటే సంబంధిత ఓటరు స్వయంగా ఆసక్తి చూపించాలి. సాధారణంగా ఎక్కువ మంది ఓటర్లు ఈ విషయంలో అంత శ్రద్ధ తీసుకోరు. ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి వేలాది మంది తమ ఓట్లు తొలగిపోయాయని గుర్తించినా, అప్పటికప్పుడు వాటిని తిరిగి చేర్పించడం రాజకీయ పార్టీలకు కూడా కష్టసాధ్యమవుతుంది. అందుకే “నివారణే మేలు” అన్నట్లు ముందుగానే పార్టీలు అప్రమత్తమవుతున్నాయి. ఇక్కడే అసలు రాజకీయ ట్విస్ట్ దాగి ఉంది. సిద్ధాంతపరంగా “స్వచ్ఛమైన ఓటర్ల జాబితా” కావాలని అన్ని పార్టీలు బహిరంగంగా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయి రాజకీయాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ప్రతి నియోజకవర్గంలోనూ కొంతమేరకు డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తమకు అనుకూలంగా ఉపయోగపడతాయని స్థానిక నాయకులు భావిస్తుంటారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను కాపాడుకుంటూ, ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన అనుమానాస్పద ఓట్లను తొలగించాలనే ద్వంద్వ వైఖరి దాదాపు అన్ని పార్టీల్లో కనిపిస్తోంది. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఎన్నికల సంఘం ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అమలు చేస్తుండగా, రాజకీయ పార్టీలు మాత్రం తమ ఓటు బ్యాంకు చెదరకుండా కాపాడుకోవడంపైనే దృష్టి సారించాయి. ఈ ప్రక్రియ ముగిసే సమయానికి ఏ పార్టీ తన బూత్ స్థాయి యంత్రాంగాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటుందో, ఆ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా ముందంజలో నిలిచే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సింగపూర్ ఎన్నారై ప్రతినిధులతో కేటీఆర్ ప్రత్యేక సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగపూర్, మలేషియా పర్యటనల సందర్భంగా అక్కడి అభివృద్ధి నమూనాలను పరిశీలించిన విషయాలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆ దేశాల్లో విజయవంతంగా అమలవుతున్న పలు విధానాలను తెలంగాణలో అనుసరించేందుకు గతంలో కూడా ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగపూర్ ఎన్నారై ప్రతినిధులు సింగపూర్‌లో కూడా తెలంగాణ సభ నిర్వహించాలని కేటీఆర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. తెలంగాణ సంస్కృతి, భాష, అభివృద్ధి దిశగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలను ఒక వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్, బీఆర్ఎస్ సింగపూర్ సభ్యులు రంజిత్ రావు, పెద్ది శేఖర్, రజనీకాంత్, కిరణ్ షెర్ల, టీసీఎస్ఎస్ సభ్యులు నల్లా భాస్కర్, రాజు, వీఏఎం సభ్యులు కైల నాగరాజు, రమణ, ఎస్‌టీఎస్ సభ్యులు కోటి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బైరి రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై హరీశ్ ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

పేదల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. పెద్దపల్లి జిల్లాలో ఆదివారం పర్యటించిన హరీశ్‌రావు పలు కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం బెదిరింపుల రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులకు, భూములకు గౌరవం లేకుండా పోయిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కూడా హరీశ్‌రావు స్పందించారు. అధికారంలో ఉన్నవారు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, అహంకార ధోరణితో ముందుకు వెళ్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రైతుల మద్దతు లేకుండా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదా..? అని ప్రశ్నించిన హరీశ్‌రావు, ఇప్పుడు అదే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత కాంగ్రెస్‌కు భవిష్యత్తులో భారీ నష్టాన్ని తెస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే రైతు సమస్యలపై దృష్టి పెట్టి, భూసంబంధిత ఇబ్బందులను పరిష్కరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## అమెరికాలో తెలుగు విద్యార్థి దారుణ హత్య

**మొదటి పేజీ తరువాయి**

వివరాల ప్రకారం.. దుండగులు పక్కా ప్రణాళికతో ఒక ఖాళీ ఇంటి అడ్రస్‌కు ఫుడ్ డెలివరీ ఆర్డర్ ఇచ్చి అన్షుల్‌ను అక్కడికి రప్పించారు. అతను ఆర్డర్‌ను డెలివరీ చేసి తిరిగి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు అతనిపై అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపారు. ముఖ్యంగా తలపై కాల్చడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అన్షుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలంలో ఖాళీ ఇంటి లోపల మూడు అన్‌ఓపెన్ పిజ్జా బాక్స్‌లు, డెలివరీ బ్యాగ్ లభించాయని పోలీసులు వెల్లడించారు. దీనిని బట్టి డెలివరీ పూర్తిచేసిన వెంటనే దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. అదేవిధంగా సమీప ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీల్లో నల్లటి దుస్తులు ధరించిన ఇద్దరు వ్యక్తులు అన్షుల్‌ను వెంబడించిన దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. ఘటనాస్థలంలో లభించిన బుల్లెట్ షెల్స్‌తో పాటు ఇతర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డెలివరీ ఆర్డర్ కోసం ఉపయోగించిన ఫోన్ నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు డిటెక్టివ్‌లు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఈ కేసులో ఎవరినీ అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు

**మొదటి పేజీ తరువాయి**

తిరిగి ప్రారంభం కావాల్సి ఉండగా, తాజాగా ప్రభుత్వం రీఓపెన్ తేదీని జూన్ 15కు మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 13న రెండో శనివారం, జూన్ 14న ఆదివారం రావడంతో పాఠశాలల పునఃప్రారంభ తేదీని మరోసారి పరిశీలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, పాఠశాల యాజమాన్యాల నుంచి ప్రభుత్వానికి పలు అభ్యర్థనలు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సెలవులను మరో మూడు రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు జూన్ 15 సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు మరికొంత విశ్రాంతి లభించినట్లైంది.



## ప్రభుత్వ ఆస్పత్రిలో యువతి మృతి

**మొదటి పేజీ తరువాయి**

ఇందు మృతి చెందిందంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com